09-07-2020 ఉదయము మురళి ఓంశాంతి బాప్‌దాదా మధువనము

**" మధురమైన పిల్లలారా - సమయం లభించినప్పుడు ఏకాంతములో కూర్చుని విచార సాగర మథనము చేయండి. ఏ పాయింట్లు వింటారో వాటిని రివైజ్ చేయండి "**

**ప్రశ్న :-** మీ స్మృతియాత్ర ఎప్పుడు పూర్తి అవుతుంది ?

**జవాబు :-** ఎప్పుడైతే మీ కర్మేంద్రియము ఏదీ మోసము చేయదో, కర్మాతీత స్థితి వస్తుందో అప్పుడు స్మృతియాత్ర పూర్తి అవుతుంది. ఇప్పుడు మీరు పూర్తిగా పురుషార్థము చేయాలి. నిరాశ చెందరాదు. సర్వీసులో తత్పరులై ఉండాలి.

**ఓంశాంతి.** మధురాతి మధురమైన పిల్లలు ఆత్మాభిమానులుగా అయి కూర్చుని ఉన్నారా? అర్ధకల్పము మేము దేహాభిమానములో ఉన్నాము, ఇప్పుడు ఆత్మాభిమానులుగా అయి ఉండేందుకు శ్రమ చేయవలసి వస్తుందని పిల్లలు అర్థం చేసుకున్నారు. స్వయాన్ని ఆత్మగా భావించి కూర్చోండి, అప్పుడే తండ్రి గుర్తుకొస్తారు లేకుంటే మర్చిపోతారని బాబా వచ్చి అర్థం చేయిస్తారు. స్మృతి చేయకుంటే యాత్ర ఎలా చేయగలరు! పాపం ఎలా సమాప్తమౌతుంది! నష్టం కలుగుతుంది. ఇది క్షణ-క్షణము గుర్తు చేసుకోండి. ఇది ముఖ్యమైన విషయము. పోతే తండ్రి అనేక ప్రకారాలైన యుక్తులు తెలియచేస్తారు. ఏది తప్పో, ఏది ఒప్పో కూడా అర్థం చేయించారు. తండ్రి జ్ఞానసాగరులు, వారికి భక్తిని గురించి కూడా తెలుసు. పిల్లలు భక్తిలో ఏమేమో చేయవలసి ఉంటుంది, ఈ యజ్ఞ, తపాలు మొదలైనవి చేయడం భక్తిమార్గమని తెలిపిస్తున్నారు. భలే తండ్రిని మహిమ చేస్తారు, కాని ఉల్టాగా మహిమ చేస్తారు. వాస్తవానికి శ్రీ కృష్ణుని మహిమ కూడా పూర్తిగా తెలియదు. ప్రతి విషయాన్ని అర్థము చేసుకోవాలి కదా. కృష్ణుని వైకుంఠనాథుడని అంటారు, మంచిది. కృష్ణుని త్రిలోకనాథుడని అనవచ్చా? అని బాబా ప్రశ్నిస్తారు. త్రిలోకనాథుడని మహిమ చేయబడ్తుంది కదా. ఇప్పుడు మూడులోకాల నాథుడు అనగా మూలవతనము, సూక్ష్మవతనము, స్థూలవతనము. మీరు బ్రహ్మాండానికి కూడా అధికారులని పిల్లలైన మీకు అర్థం చేయించబడింది. నేను బ్రహ్మాండానికి యజమానని కృష్ణుడు అనుకుంటూ ఉంటాడా? లేదు. కృష్ణుడు వైకుంఠములో ఉండేవాడు, నూతన ప్రపంచమైన స్వర్గాన్ని వైకుంఠమని అంటారు. కనుక వాస్తవానికి త్రిలోకనాథుడు ఎవ్వరూ లేరు. తండ్రి సరియైన(రైటు) విషయాలను తెలియచేస్తున్నారు. మూడు లోకాలైతే ఉన్నాయి, బ్రహ్మాండానికి శివబాబా కూడా యజమాని, మీరు కూడా యజమానులే. సూక్ష్మవతనము మాటే లేదు. స్థూల వతనములో కూడా వారు యజమాని కాదు. స్వర్గానికి కాని, నరకానికి కాని వారు యజమాని కాదు. కృష్ణుడు స్వర్గానికి యజమాని, నరకానికి యజమాని రావణుడు. దీనిని రావణరాజ్యము, ఆసురీ రాజ్యమని అంటారు. మనుష్యులు కూడా అంటారు కాని వారికి అర్థము తెలియదు. పిల్లలైన మీకు తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు. రావణునికి 10 తలలు ఇచ్చారు. 5 వికారాలు స్త్రీలోనివి, 5 వికారాలు పురుషునివి. ఇప్పుడు 5 వికారాలు అందరిలోనూ ఉన్నాయి. అందరూ రావణ రాజ్యములోనే ఉన్నారు. ఇప్పుడు మీరు శ్రేష్ఠాచారులుగా అవుతున్నారు. తండ్రి వచ్చి శ్రేష్ఠాచార ప్రపంచాన్ని తయారు చేస్తారు. ఏకాంతంలో

కూర్చుంటే ఇలా ఇలా విచార సాగర మథనము నడుస్తుంది. ఆ చదువులో కూడా విద్యార్థులు పుస్తకాలు తీసుకుపోయి ఏకాంతంలో చదువుతారు. మీరు పుస్తకాలు చదివే అవసరము లేదు. అయితే మీరు పాయింట్లు వ్రాసుకుంటారు. వాటిని మళ్లీ రివైజ్ చేయాలి. ఇవి అర్థము చేసుకోవలసిన చాలా గుహ్యమైన విషయాలు. నేడు మీకు గుహ్యాతి గుహ్యమైన నూతన పాయింట్లు అర్థం చేయిస్తానని తండ్రి చెప్తారు కదా. లక్ష్మీనారాయణులు పారసపురికి యజమానులు. విష్ణువని కూడా అనము. ఈ లక్ష్మీనారాయణులే విష్ణువని కూడా భావించరు. ఇప్పుడు మీరు క్లుప్తంగా ముఖ్యమైన గుర్తి, లక్ష్యాలను అర్థం చేయిస్తారు. బ్రహ్మ-సరస్వతులు కూడా పరస్పరములో భార్య-భర్తలు కాదు. ఇతను ప్రజాపిత బ్రహ్మ కదా. ప్రజాపిత బ్రహ్మను గ్రేట్ గ్రేట్ గ్రాండ్ ఫాదర్ అని అనవచ్చు. శివబాబాను కేవలం బాబా అనే అంటారు. మిగిలినవారందరూ సోదరులు. వీరందరు బ్రహ్మ సంతానము. భగవంతుని సంతానమైన మనము సోదరులమని అందరికీ తెలుసు. కాని అది నిరాకార ప్రపంచములో, ఇప్పుడు మీరు బ్రాహ్మణులుగా అయ్యారు. కొత్త ప్రపంచమని సత్యయుగమును అంటారు. దీని పేరు పురుషోత్తమ సంగమ యుగమని ఉంచబడింది. సత్యయుగంలో పురుషోత్తములే ఉంటారు. ఇవి చాలా అద్భుతమైన విషయాలు. మీరు నూతన ప్రపంచము కొరకు తయారౌతున్నారు. ఈ సంగమ యుగములోనే మీరు పురుషోత్తములుగా అవుతారు, మేము లక్ష్మీనారాయణులుగా అవుతామని కూడా చెప్తారు. వీరు అందరి కంటే ఉత్తమ పురుషులు. వారిని దేవతలని అంటారు. ఉత్తమోత్తములు నెంబరువన్ లక్ష్మీనారాయణులు. తర్వాత పిల్లలైన మీరు నెంబరువారుగా అవుతారు. సూర్యవంశీయులను ఉత్తములని అంటారు. నెంబరువన్ కదా. నెమ్మది - నెమ్మదిగా కళలు తగ్గిపోతాయి.

ఇప్పుడు పిల్లలైన మీరు కొత్త ప్రపంచానికి ముహూర్తము పెడ్తారు, కొత్త ఇల్లు తయారైనప్పుడు పిల్లలకు సంతోషము కలుగుతుంది కదా. ముహూర్తము పెడ్తారు. పిల్లలైన మీరు కూడా కొత్త ప్రపంచాన్ని చూసి సంతోషిస్తారు. ముహూర్తము పెడ్తారు. స్వర్ణిమ పుష్పాల వర్షము కురుస్తుందని కూడా వ్రాయబడింది. మీలో ఖుషీ పాదరస మట్టము ఎంతగా పెరగాలి! మీకు సుఖ-శాంతులు రెండూ లభిస్తాయి. ఇంతటి సుఖ-శాంతులు లభించేవారు వేరెవ్వరు లేరు. రెండవ ధర్మము వచ్చినట్లయితే ద్వైతమైపోతుంది. మేము పురుషార్థము చేసి ఉన్నత పదవిని పొందుకున్నామని పిల్లలలో అపారమైన సంతోషము ఉండాలి. భాగ్యములో ఏముంటే అది లభిస్తుంది, పాసవ్వాలని ఉంటే అవుతామని అనుకోరాదు, అలా కాదు. ప్రతి విషయములో పురుషార్థము తప్పకుండా చేయాలి. పురుషార్థము చేయలేకుంటే భాగ్యములో ఏముంటే అది అవుతుందని అంటారు. తర్వాత పురుషార్థము చేయడమే ఆగిపోతుంది. మాతలైన మిమ్ములను ఎంతో శ్రేష్ఠంగా తయారు చేస్తానని తండ్రి చెప్తున్నారు. స్త్రీలకు అన్ని స్థానాలలో గౌరవముంది. విదేశాలలో కూడా గౌరవముంది. ఇక్కడ కూతురు జన్మించినట్లయితే మంచము ఉల్టా చేస్తారు. ప్రపంచమంతా చాలా మురికిగా ఉంది. భారతదేశము ఒకప్పుడు ఎలా ఉండేదో, ఇప్పుడు ఎలా ఉందో మీరు అర్థము చేసుకున్నారు. మనుష్యులు మర్చిపోయారు. కేవలం శాంతి-శాంతి అని అడుగుతూ ఉంటారు. విశ్వంలో శాంతిని కోరుకుంటారు. మీరు ఈ లక్ష్మీనారాయణుల చిత్రాన్ని చూపించండి. వీరి రాజ్యము ఉన్నప్పుడు పవిత్రత, సుఖ-శాంతులు కూడా ఉండేవి. మీకిలాంటి రాజ్యము కావాలి కదా అని అడగండి. మూలవతనంలో విశ్వశాంతి అని అనరు. విశ్వములో శాంతి

ఇక్కడే ఉంటుంది కదా. దేవతల రాజ్యము పూర్తి విశ్వములో ఉండేది. మూలవతనమంటే ఆత్మల ప్రపంచము. ఆత్మల ప్రపంచము ఉంటుందని కూడా మనుష్యులకు తెలియదు. నేను మిమ్ములను ఎంత ఉన్నతంగా, పురుషోత్తములుగా చేస్తాను! ఇది అర్థము చేయించే విషయము అని బాబా చెప్తారు. భగవంతుడు వచ్చారని బిగ్గరగా అరవడం కాదు, అలా చెప్తే ఎవ్వరూ అంగీకరించరు. ఇంకా తిట్లు తింటారు, తినిపిస్తారు. బి.కెలు తమ బాబాను భగవంతుడని అంటారని వారంటారు. ఇలా సర్వీసు జరగదు. బాబా యుక్తులు తెలియచేస్తూ ఉంటారు. గదిలో 8-10 చిత్రాలు గోడ పై బాగా తగిలించండి. బేహద్ తండ్రి నుండి బేహద్ సుఖపు ఆస్తిని తీసుకోవాలంటే లేక మనుష్యుల నుండి దేవతలుగా అవ్వాలంటే రండి మేము మీకు అర్థం చేయిస్తామని వెలుపల వ్రాయండి. ఇది చూసి చాలామంది వస్తారు. వారంతకు వారే వస్తారు. విశ్వములో శాంతి ఉండేది కదా. ఇప్పుడు ఇన్ని అనేక ధర్మములున్నాయి, తమోప్రధాన ప్రపంచములో శాంతి ఎలా ఉంటుంది? విశ్వములో శాంతి భగవంతుడు మాత్రమే తీసుకు రాగలడు. శివబాబా వచ్చినప్పుడు తప్పకుండా ఏదైనా బహుమతి తీసుకు వస్తారు. అంత దూరము నుండి వచ్చే తండ్రి వీరు ఒక్కరే, ఈ బాబా ఒక్కసారి మాత్రమే వస్తారు. ఇంత గొప్ప బాబా 5 వేల సంవత్సరముల తర్వాత వస్తారు. యాత్ర నుండి వెనుతిరిగి వచ్చునప్పుడు పిల్లల కొరకు ఏదైనా బహుమతి తీసుకుని వస్తారు కదా. పత్నికి పతి, పిల్లలకు తండ్రి అవుతారు కదా. తర్వాత తాత, ముత్తాత, ముత్తాతలకు తాత అవుతారు. వీరిని మీరు బాబా అని అంటారు, గ్రాండ్ ఫాదర్ కూడా అవుతాడు. గ్రేట్ గ్రాండ్ ఫాదర్ కూడా అవుతాడు. వంశములున్నాయి కదా. ఆడమ్, ఆదిదేవ్ అని పేర్లున్నాయి. కాని మనుష్యులకు అర్థము కాదు. మీకిప్పుడు తండ్రి కూర్చుని అర్థం చేయిస్తున్నారు - తండ్రి ద్వారా సృష్టిచక్రము యొక్క చరిత్ర - భూగోళాలను మీరు తెలుసుకుని చక్రవర్తి రాజులుగా అవుతున్నారు. బాబా ఎంత ప్రేమతో, ఆసక్తితో చదివిస్తారు కనుక అంతగా చదవాలి కదా. ప్రాత: కాల సమయములో అందరూ తీరికగా ఉంటారు. ఉదయము క్లాసు అర్ధగంట - ముక్కాలు గంట ఉంటుంది. మురళి విని మళ్లీ వెళ్ళిపోండి. స్మృతి అయితే ఎక్కడ ఉన్నా చేస్తూ ఉండవచ్చు. ఆదివారము శెలవు ఉంటుంది. ఉదయము 2-3 గంటలు కూర్చోండి. పగటి సంపాదనను మేకప్ చేసుకోండి. జోలెను పూర్తిగా నింపుకోండి. సమయము లభిస్తుంది కదా. మాయా తుఫాను రావడం వలన స్మృతి చేయలేరు. బాబా చాలా సహజంగా అర్థం చేయిస్తున్నారు. భక్తిమార్గములో చాలా సత్సంగాలకు వెళ్తారు. కృష్ణుని మందిరానికి, శ్రీనాథుని మందిరానికి ఇంకా వేరే వేరే మందిరాలకు వెళ్తారు. యాత్రలో కూడా చాలా మంది వ్యభిచారులుగా అవుతారు, అంత కష్టపడినా ఫలితమేమీ ఉండదు. డ్రామాలో ఇది కూడా నిర్ణయింపబడింది, మళ్లీ జరుగుతుంది. మీ ఆత్మలో పాత్ర నిండి ఉంది. సత్య-త్రేతా యుగాలలో ఏ పాత్ర క్రిందటి కల్పములో అభినయించారో అదే అభినయిస్తారు. మందబుద్ధి గలవారు ఇది కూడా అర్థము చేసుకోలేరు. ఎవరు సూక్ష్మబుద్ధి గలవారుగా ఉంటారో వారే బాగా అర్థము చేసుకుని, ఇతరులకు అర్థం చేయించగలరు. ఇది తయారైన అనాది నాటకమని వారి ఆంతరికములో అనుభవమవుతుంది. ఇది బేహద్ నాటకమని ప్రపంచములో ఎవ్వరికీ తెలియదు. దీనిని అర్థము చేసుకునేందుకు కూడా సమయం పడుతుంది. ప్రతి విషయము విస్తారంగా అర్థం చేయించిన తర్వాత - స్మృతియాత్ర ముఖ్యమైనదని చెప్పబడుతుంది. క్షణములో జీవన్ముక్తి అని కూడా

గాయనముంది. జ్ఞానసాగరులు అను గాయనము కూడా ఉంది. సముద్రమునంతా సిరా(ఇంకు)గా చేసుకుని అడవిలోని వృక్షాలన్నిటిని కలముగా చేసుకుని భూమిని కాగితముగా చేసుకుని..... వ్రాసినా అంతము కాదు అని మహిమ చేస్తారు. ప్రారంభము నుండి మీరు ఎంతగా వ్రాస్తూ వచ్చారు. కాగితాలు ఎన్నో అయిపోయాయి. మీరు ఎదురుదెబ్బలు తినరాదు. ముఖ్యమైనది అల్ఫ్(బాబా). తండ్రిని స్మృతి చేయాలి, ఇక్కడ కూడా మీరు శివబాబా వద్దకు వస్తారు, శివబాబా వీరిలో ప్రవేశించి మిమ్ములను చాలా ప్రేమతో చదివిస్తారు. ఏ ఆడంబరమూ లేదు. నేను పాత శరీరములోనే వస్తానని తండ్రి చెప్తున్నారు. సాధారణ రీతిలో శివబాబా వచ్చి చదివిస్తున్నారు. ఏ అహంకారమూ లేదు. ఓ బాబా! పతిత ప్రపంచములో పతిత శరీరములో రండి, వచ్చి మాకు శిక్షణను ఇవ్వండి అని నన్ను పిలుస్తారని అంటున్నారు. సత్యయుగంలో వజ్రవైడూర్యాల భవనములో కూర్చోండి, భోజనము చేయండి..... అని నన్ను పిలువరు. శివబాబా భోంచేయరు. వచ్చి భోంచేయండి అని ఇంతకుముందు పిలిచేవారు. 36 రకాల భోజనము తినిపించేవారు. ఇది మళ్ళీ జరుగుతుంది. ఇది కూడా చరిత్ర అనే అంటారు. కృష్ణుని చరిత్ర ఏమిటి? వారు సత్యయుగపు రాకుమారుడు. వారిని పతితపావనుడని అనరు. సత్యయుగంలో వీరు విశ్వానికి అధికారులుగా ఎలా అయ్యారో కూడా మీరిప్పుడు తెలుసుకున్నారు. మనుష్యులు పూర్తి గాఢాంధకారములో ఉన్నారు. ఇప్పుడు మీరు అమోఘమైన ప్రకాశములో ఉన్నారు. తండ్రి వచ్చి రాత్రిని పగలుగా చేస్తారు, అర్ధకల్పము మీరు రాజ్యము చేస్తారు, కనుక ఎంత సంతోషము ఉండాలి.

ఎప్పుడైతే మిమ్ములను ఏ కర్మేంద్రియాలూ మోసము చేయవో అప్పుడు మీ స్మృతియాత్ర పూర్తి అవుతుంది. కర్మాతీత స్థితిని పొందినప్పుడు స్మృతియాత్ర పూర్తి అవుతుంది. ఇప్పుడింకా పూర్తి అవ్వలేదు. ఇప్పుడు మీరు పూర్తిగా పురుషార్థము చేయాలి. నిరాశ చెందరాదు. సర్వీసులోనే మునిగిపోవాలి. తండ్రి కూడా వచ్చి వృద్ధ తనువు ద్వారా సర్వీసు చేస్తున్నారు కదా. తండ్రి చేసి చేయించేవారు. ఇది తయారు చేయాలని, పిల్లల కొరకు భవనాలు కట్టాలని ఎంతో చింత ఉంటుంది. ఎలా లౌకిక తండ్రికి హద్దులోని ఆలోచనలు ఉంటాయో అలా పారలౌకిక తండ్రికి బేహద్ ఆలోచనలుంటాయి. పిల్లలైన మీరే సర్వీసు చేయాలి. రోజురోజుకు చాలా సహజమౌతూ ఉంటుంది. వినాశనానికి ఎంత సమీపంగా వస్తారో అంత శక్తి వస్తూ ఉంటుంది. భీష్మపితామహుడు మొదలైనవారికి చివర్లో బాణము తగిలిందని మహిమ కూడా ఉంది. ఇప్పుడే బాణము తగిలినట్లయితే చాలా హంగామా అయిపోతుంది. ఎంత గుంపు వచ్చేస్తుందంటే వర్ణించలేము. తల గోక్కునే సమయము కూడా లేదు అని చెప్తారు కదా! అలా ఎవ్వరూ ఉండరు. కాని గుంపు వచ్చే కారణంగా అలా అంటారు. ఎప్పుడు వీరికి బాణము తగుల్తుందో అప్పుడు మీ ప్రభావము వెలువడ్తుంది. పిల్లలందరికీ తండ్రి పరిచయము లభించాల్సిందే.

మీరు మూడడుగుల జాగాలో కూడా ఈ అవినాశి ఆసుపత్రి, ఈశ్వరీయ విశ్వ విద్యాలయాన్ని తెరవవచ్చు. ధనము లేకపోయినా పర్వాలేదు. చిత్రాలు మీకు లభిస్తాయి. సర్వీసులో మానావమానాలు, సుఖ-దు:ఖాలు, శీతలత - ఉష్ణములు అన్నీ సహించాలి. ఎవరినైనా వజ్ర సమానంగా తయారు చేయడం చిన్న విషయమా! తండ్రి ఎప్పుడైనా అలసిపోతారా? మీరెందుకు అలసిపోతారు? మంచిది.

**మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.**

**ధారణ కొరకు ముఖ్య సారము :-**

1. ప్రాత: కాల సమయము అర్ధగంట - ముప్పావు గంట చాలా ప్రీతితో ఆసక్తిగా చదువు(మురళి) చదవాలి. తండ్రి స్మృతిలో ఉండాలి. అన్ని కర్మేంద్రియాలు అధీనములోకి వచ్చునట్లు స్మృతి చేయు పురుషార్థము చేయాలి.

2. సేవ చేయునప్పుడు సుఖ - దు:ఖాలు, మానావమానాలు, శీతలత - ఉష్ణములు మొదలైనవన్నీ సహనము చేయాలి. సర్వీసులో ఎప్పుడూ అలసిపోరాదు. మూడడుగుల జాగాలో కూడా ఆసుపత్రి మరియు విశ్వ విద్యాలయాన్ని తెరిచి వజ్ర సమానంగా తయారు చేయు సేవ చేయాలి.

## వరదానము :- " సర్వ శక్తుల లైటు ద్వారా ఆత్మలకు దారి చూపించే చైతన్య లైట్‌హౌస్ భవ "

సదా మీరు 'నేను ఆత్మను, విశ్వకళ్యాణము కొరకు సేవ చేసేందుకు అవతరించాను' అను స్మృతిలో ఉంటే, మీరు ఏ సంకల్పము చేసినా, ఏ మాట మాట్లాడినా అందులో విశ్వకళ్యాణము ఇమిడి ఉంటుంది. అంతేకాక స్మృతియే లైట్‌హౌస్ చేసే పని చేస్తుంది. ఎలాగైతే ఆ లైట్‌హౌస్ ద్వారా ఒక రంగు లైటు వెలువడ్తుందో, అలా చైతన్య లౌట్‌హౌస్‌లైన మీ ద్వారా సర్వ శక్తుల లైటు ప్రతి అడుగులో ఆత్మలకు దారి చూపించే కార్యము చేస్తూ ఉంటుంది.

## స్లోగన్:-" స్నేహము మరియు సహయోగముతో పాటు శక్తి రూపంగా అయితే రాజధానిలో ముందు నంబరు లభిస్తుంది. "